## 1980 సంక్రాంతి కథల పోటీలో రెండవ బహుమతి రు. 1000/- గెలుచుకున్న కథ

# రింగు మాస్టరు కొరడా ఝుళిపించాడు.

పులి అతన్ని మింగేసేట్టు చూసింది. అయినా చెయ్యగలిగిందేమీలేక ఎదురుగా వున్న చిన్న బల్ల ఎక్కింది.

చెవులు హోరెత్తేట్లు వెనకాల వాద్యసంగీతం. ఆ వాయించే వాడెవడూ పులి ఫీట్లు చూడ్డంలేదు. వాళ్ళు జనంవంక కాసేపు, ఎటో అర్థంకానివంక కాసేపు చూస్తూ యాంత్రికంగా వాయించేస్తున్నారు. వాళ్ళలా ఎన్నో వేల సార్లు ఈ ఫీట్లకి వాయించి వుంటారు. రింగు మాస్టరుకి దూరంగా కర్రలు పట్టుకొని నలుగు రైదుగురు మనుష్యులు—కొందరు బోన్లదగ్గర—వాళ్ళెవరికీ ఈ జరిగే వాటిమీద కుతూహలంలేదు. కాసేపు వాళ్ళలో వాళ్ళు మాట్లాడుకుంటారు. మరి కాసేపు దిక్కులు చూస్తారు, కాసేపు పచార్లు చేస్తారు. కానీ, వాళ్ళందరి చూపులూ ఒకటే. యంత్రాలకి కళ్ళుంటే ఎలా వుంటాయి? అలాగే.



చప్పట్లు పడ్డాయి.

శేషగిరి లోకంలో పడ్డాడు. ఏమిటా అన్నట్లు చూశాడు. పులి నాలుకాళ్ళతో ఒక ఇనుప బంతిమీద కెక్కి, దాన్ని దొర్లిస్తోంది.

జనానికి వెర్రి ఆనందం..... అందరికీ ఒకటే ఉత్సుకత!

పులివంక మళ్ళీ చూశాడు శేషగిరి.

పోషణలేక చిక్కిన శరీరం.

పులి కళ్ళలో, అతనికి క్రౌర్యం కనపడ లేదు.

దైన్యం! నిస్సహాయతలోంచి పుట్టుకొచ్చిన దైన్యం!

జాగ్రత్తగా బాల్‌ని తోస్తోంది.

ఈ ఆట దానికిష్టమా? పోనీ ఇలా ఆడ్డం దాని సహజలక్షణమా? ఒక్కసారి దాన్ని స్వేచ్ఛగా అడవిలో వదిలేస్తే! —

జనం అంతా దాని సహజ లక్షణాన్ని చూసి ఆనందించరేం? మెరుపులాంటి దాని పరుగులో సౌందర్యం — కళ్ళలో క్రౌర్యం — పంజా కొట్టటంలో నేర్పు....

దానికి చేతకానిదేదో దానిచేత చేయించి దాన్ని అసహజంగా చూడ్డంలో ఆనందం ఎలా వస్తోంది?

"ఇక్కడకొచ్చి చూడక ఆలోచిస్తావేమిటయ్యా?" బ్రహ్మానందం చేతులు పైకెత్తి ఆవులిస్తూ అడిగాడు.

శేషగిరి చిన్నగా నవ్వాడు. పులి ఎప్పుడో వెళ్ళిపోయింది.

రింగుమాస్టరు పొమ్మనగానే బతుకు జీవుడా అని పారిపోయుంటుంది. "పేలాలు తిందామా?" బ్రహ్మానందం సార్థక నామధేయుడు పెన్ను కొనుక్కున్నపుడూ, ఇడ్లీ తిన్నపుడుకూడా ప్రపంచంలో ఉన్నదంతా తనకు లభించినంత ఆనందపడుతూ ఉంటాడు.

"వీళ్ళిలా పోటీగా ఎందుకుండి పోతారోయ్?" పేలాలు మర్చినట్లున్నాడు.

మధ్యలో విరామం గాబోలు. మరుగుజ్జులు నలుగురైదుగురు ఒకళ్ళనొకళ్ళు తోసుకుంటూ, చప్పుడు చేసే చెక్కలతో కొట్టుకుంటూ! వాళ్ళ హాస్యానికి శేషగిరికి నవ్వు రావడంలేదు. సజీవత లోపించింది ఆ హాస్యంలో.

దేరా అంతా చీకటైపోయింది ఒక కాంతివంతమయిన లైటు మాత్రం దేరా పై భాగానికి ఫోకస్ చేయబడి వుంది.

క్షణంలో ఎవడో పైన కటిని ఉయ్యాలెక్కేసి, విన్యాసాలు చేసేస్తున్నాడు. ఒక

---

'సర్కస్' వినోదం కంటే విషాదమే యెక్కువ. కనిపించే వినోదమూ, కనిపించని విషాదమూ కలగలిసి పోవడమే అసలు సర్కసేమో!

చేత్తో వేలాడు , కాలుతో వేలాడుతూ. ఎముకలేనట్లు గింగిర్లు కొడుతూ –

క్రింద వల కూడా లేదు. పడితే హరీ మనడం తథ్యం....

చప్పట్లు....

ఆ ఉయ్యాల మీద వాడు కాళ్ళు పైకి పెటి తల కిడ్డీ మీద ఆన్చి ఊగుతున్నాడు.

చప్పట్లు.... ఈలలు....

వాడు పడితే!

ఎందుకంత ప్రయాసపడి వాడు అలా చెయ్యటం?

శేషగిరి చుటూ జనాన్ని చూశాడు.

అంతులేని ఆనందం.... కుతూహలం.

మనిషి ఇంకా ఆటవికుడే. సందేహం లేదు. ఎదటివాడు ప్రమాదానికి ఎంత దగ్గరగా వెడితే మనిషికంత ఎక్సైట్‌మెంటు.

వాడు పడితే!

శేషగిరి కడుపులో దేవింది.

"నే పోతాను బ్రహ్మనందం."

లేచ్చుకొని వచ్చేశాడు.

వెనకాల బ్రహ్మనందం అనిపిలిసేఆగి పోయాడు. మళ్ళీ అతనూ ఈల కొడుతూ చూస్తూ వుంటాడు ఏ పేలాలో తింటూ.

శేషగిరి డేరా బయటికొచ్చాడు. చల్లగాలి వంటికి తగిలింది. సిగరెట్ ముటించి చుట్టూ చూశాడు. రంగు రంగుల చిన్న బల్బులతో డేరా అంతా అలంకరించారు. డేరా ముందర తగిలించిన బోర్డులమీద లోపల వాళ్ళు చేయబోయే విన్యాసాలు వర్ణిస్తూ బొమ్మలు! వాటికి తళుకు అద్దినట్లున్నారు. అవి దీపాల వెలుగులో తళతళ్ళాడుతున్నాయి.

ఈ తళుకు నిజంగా వీళ్ళ జీవితాల్లో వుందా?

బ్రహ్మండమయిన డేరా. జంతువులు. పెద్ద పెద్ద పరికరాలు. సిబ్బంది. డేరాలు వేస్తూ తీస్తూ. ఊరూరా తిరుగుతూ. ప్రాణాలకు తెగిస్తూ.... ఈ వెలుగుల వెనకాల, ఈ తళుకుల వెనకాల, ఏదో ఒక విషాదపు ఛాయ.



# సర్కస్

## ఉప్పులూరి పార్వతి

రోడ్డుమీద కొచ్చినాక తెలిసింది అతనికి సర్కస్ వాతావరణానికి చాలాదూరం వచ్చినట్లు. తాను ఎలా వచ్చాడు? తనకే గుర్తు లేదు

కొంప మునిగి పోయిందేం లేదులే అన్నట్లు చేతులు కట్టుకొని రోడ్డు మీద నడక సాగించాడు మెల్లగా.

కూరగాయల మార్కెట్ చూశాక అతనికి జ్ఞాపకం వచ్చింది. సంచీ ఏదీ? ఎక్కడ? జేబులు తడుముకున్నాడు, వుండ

దని తెలిసికూడా ఆ సంచీ జేబులో ఎప్పుడూ పెట్టను. ఆఫీసులో ఎవరైనా తీశాడా? లేదు. హోటల్లో సర్వరు కుర్చీలో మర్చిపోతే పిలిచి మరీ చేతిలో పెట్టాడు అక్కణ్ణుంచి తానూ బ్రహ్మానందం కలిసి తిన్నగా సర్కస్‌కే వచ్చారు.

క్యూలో వదిలేశాడా? టికెటు కొనేటప్పుడు జారవిడిచాడా? లేక లోపలే ఎక్కడో పారేశాడా?

శేషగిరి ఓ క్షణం ఆగాడు. అప్రయత్నంగా కాళ్ళు వెనక్కి తిరిగాయి.

ప్రఖ్యాతి చెందిన!
ఖటావ్ మిల్లు వారి
★100% పాలియస్టర్ చీరలు
★ఫుల్‌వాయిల్, అఫ్ వాయిల్ చీరలు
★షర్టింగులు, గ్లాసుకో ధోవతులు
★డ్రస్ మెటీరియల్సు, 2×2 రూబియాలాన్సు
★స్కూలు యూనిఫారంలు ... వగైరాలకు
విజయ షో రూమ్
ప్రత్యేక ఖటావ్ మిల్లు వస్త్రముల షోరూమ్
J.D. హాస్పటల్ రోడ్డు,
గవర్నరుపేట........విజయవాడ-2.

ఉచితము! ఉచితము!
తెల్లమచ్చలు
అన్ని రకాల మచ్చలను, ఎరుపు రంగును మా ప్రఖ్యాత మందు అయిదు రోజులలో మాన్పును. త్వరలోనే చర్మము మామూలు రంగు పొందును. ప్రచార నిమిత్తము ఒక పీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి. వివరాలకు.
Bharat Ayurvedashram
P.O. Katri Sarai (Gaya)

దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యం!

హస్త ప్రయోగం, అంగము చిన్నదై అవసర కాలమందు అసంతృప్తి, శుక్లనష్టము, నపుంసకత్వము, హెర్నియా, చర్మవ్యాధులు, పోస్టు ద్వారా కూడా వైద్యం చేయబడును.
వరిబీజము (బుడ్డ), మూత్ర వ్యాధులు ఆపరేషన్ లేకుండ. రండి.
డా॥ దేవర, ఫోన్ 551,
మార్వాడి గుడి వద్ద, తెనాలి.
బ్రాంచి : 5వ లైను, బ్రాడీపేట, గుంటూరు-2

మళ్ళీ మరల్చుకొనిముందుకే అడుగేశాడు. సంచీ పోయింది తధ్యం! పోతేనేం. ఎక్కడని వెతకాలి? కూరలు లేకుండా వెడితే సరి. రెండడుగులు వేసేసరికి పొద్దుట పెళ్ళాం పదేపదే కూరలు తెమ్మనిచెప్పటం జ్ఞాపకం వచ్చింది.

జేబురుమాలు తడుముకుని. రుమాలుతీసి ఏవో కొన్ని కూరలుకొని కట్టుకుని నడక సాగించాడు

తలుపు తీసేవుంది. చెప్పులు చప్పుడు చేస్తూ నడిచినా కూడా బాచిగాడు తలెత్తి చూడలేదు. నేలమీదకి వంగి కూర్చొని తెల్ల కాయితాలమీద రంగు పెన్సిళ్ళతో ఖరాబు చేస్తున్నాడు.

కోపాన్ని అదుపులో పెట్టుకుంటూ అడిగాడు శేషగిరి, "నీ పరీక్షలయిపోయినాయేమిట్రా?"

రబ్బరుతో చెరుపుకుంటున్నవాడు "ఏమిటీ వెధవ డిస్ట్రిబెన్సు అన్నట్లు ఓ చూపు పారేశాడు-"ఊఁ"

శేషగిరి గుమ్మం దాటబోతుంటే విన్పించింది. "రేపు ఏమీలేదు. ఎల్లుండి లెఖ్ఖలు పరీక్ష"

పళ్ళుబిగించి వెనక్కి తిరిగాడు శేషగిరి బాచిగాడు కాలుమీద పెచ్చుగట్టిన పుండుమీగ పెచ్చుపీక్కుంటున్నాడు బొమ్మలు మానేసి

గటిగా తంతున్నట్లు అడుగులు వేస్తూ పక్కగదిలో కెళ్ళిపోయాడు శేషగిరి. నవారు మంచం మీద అప్పుడే పడి నిద్దరోతోంది పెద్దది. దానికి ఆరవకుండానే నిద్దరొసుంది. పుట్టిన తర్వాత ఓ ఏడాదిపాటు వాళ్ళమ్మని నిద్దర పోనివ్వలేదు తాను నిద్దర పోలేదు. అదంతా బదులు తీర్చేసుకుంటున్నట్లు యిప్పుడు నిలబడికూడా నిద్దరోగల్దు. వంటింట్లో బరాబరా చీపురు చప్పుడు. సావిత్రి అన్నం తినేసి యిల్లు కూడా కడిగేస్తున్నట్లుంది.

"ఏమిటీ ఆలీశం?" ఆవిడ ఆ గదిలోకొచ్చి కొంగుతో ముక్కు తుడుచుకుంటూ అడిగింది.

"అబ్బ! ఉల్లిపాయ ఖారం!"

శేషగిరి సమాధానం చెప్పలేదు చెప్పకపోయినా ఆవిడ పట్టించుకోదు.

అతను బట్టలు మార్చుకుంటుంటే రుమాలు విప్పి. కూరలు కింద పోసుకుని పచ్చిమిరపకాయలు తొడిమలు తుంచి పారేస్తోంది.

"నా పిండాకూడు వంకాయలన్నీ పుచ్చులే. ఎంత? ఈ వెధవ కాయలిక్కూడా ముప్పావలా పోసుంటారు!"

శేషగిరి ఎందుకో తడబడ్డాడు. అతను అవి రూపాయికి కొన్నాడు. "అవును



మొదటగా నా కథను బహుమతినిచ్చి ప్రోత్సహించిన "ఆంధ్రజ్యోతి" వారికి నా కృతజ్ఞతలు.

జననం : శ్రీకాకుళం జిల్లాలోని పార్వతీపురం. స్వస్థలం: కృష్ణాజిల్లాలోని మచిలీపట్నం. విద్యాభ్యాసం : ఆంగ్లసాహిత్యంతో పట్టభద్రిత వరకు వృత్తి : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగిని వివాహం మూడుసంవత్సరాల క్రితం. భర్త: ఒక ఫార్మస్యూటికల్ కంపెనీలో రీజనల్ మేనేజర్. సంతానం : రెండు సంవత్సరాల బాబు. ప్రస్తుత నివాసం హైదరాబాదు అభిరుచులు ముఖ్యంగా సాహిత్యం ఉద్దేశ్యం : సాహిత్యం జీవితంలో ఒక భాగం అభిమాన రచయితలు : చలం. కొడవటిగంటి, బుచ్చిబాబు. రా వి శాస్త్రి. బలివాడ కాంతారావు. పాలగుమ్మి పద్మరాజు. ఆశయం : మంచి రచయిత్రిని కావాలని. తొలిరచన : "సర్కస్"

— ఉప్పులూరి పార్వతి

ముప్పావలే...." విన్పించకుండా అన్నట్లు అన్నాడు

"మిగిలిన కూరలేవీ?" ఆవిడ లేస్తూ కొంగులోకి మిరపకాయలు ఎత్తుతోంది.

"మిగిలినవా?"

"అవును-సంచీ చాల్లేదేమోగా."

అతను సంచి పోయినపుడు దోషిగా ఫీలవలేదు. కానీ సావిత్రి అడిగే పద్ధతిలో ఏదో ప్రత్యేకత వుంది. గతంలో తప్పులుగా కన్పించనివన్నీ తప్పులుగా తనకే కన్పించడం ప్రారంభిస్తాయి. నిర్లక్ష్యంగా చెప్పడానికి ప్రయత్నిస్తూ "సంచీ ఎక్కడో పోయింది" అన్నాడు.

"సంచీ పోయిందా? ఎక్కడ? ఎల్లా పారేశారు?" ఇంక ఆవిడ సమాధానం కోసం ఆగదు. "నిక్షేపంలాంటి ప్లాస్టిక

సంచీ. కొని నాల్నెల్లు కూడా అవ్వలేదు. బాచిగాడి చేతికూ్కడా ఎప్పుడూఇయ్యను. బజారుకి నేను తగలబడినా సరిపోయేది. పని వేళా వెళ్తున్న మనిషిని పిల్చి మరీ చేతులో పెట్టాను. అప్పుడే అది మూడ్రూపాయిలు. ఇప్పుడు ఏ ఆరో వుంటుంది."

శేషగిరి బాత్రూంలోకి దూరాడు. పోయిన వస్తువల్లాసావిత్రికి మరింత అమూల్యంగా కన్పిస్తుంది. కావల్సిన దానికన్నా యెక్కువ సేపు బాత్రూంలో వుండి బయటికొచ్చాడు.

పెద్ద పెద్ద చప్పుళ్ళతో అన్నం వడ్డిస్తోంది సావిత్రి. అటువంటి సమయాల్లో సావిత్రి అంతకన్న మెల్లగా చప్పుడు చేయదు. అక్కసంతా గిన్నెలమీద, గరిటెలమీద తీర్చుకుంటూ వుంటుంది.

శేషగిరి తింటున్నాడు. అంతసేపూ ఆవిడ ఏదో అంటూనే వుంది. "ఏపని చేసినా యిల్లాగే చేసుకొస్తారు. ముసలాళ్ళకయినా వుండదు ఇంత మతిమరుపు...."

"మజ్జిగ."

పోసింది "పెద్దదాని స్కూలు ఫీజు కడతానన్నారు కట్టేరా?"

నాలిక్కరుచుకున్నాడు. "లేదు. డబ్బిలిస్తాను దాన్నే కట్టుకోమన్నాదూ?"

"పిల్లలు డబ్బులు పారేస్తారని చేతికివ్వరయ్యె! మనకన్న వాళ్ళేనయం...."

"ఇంక నుంచి ఇస్తాలే!"

"అన్నం...."

"వద్దులే–" ఎప్పుడు ముగించి లేచొద్దామా అన్నట్లుంది అతనికి. ఇంకా కూర్చునే సహనం లేదు.

ఇంటికీ, ప్రహరీ గోడకీ మధ్యనున్న సందులో పడక్కుర్చీ వేసుకున్నాడు.

"నిన్ను పంపినా సరిపోయేదిరా! నిక్షేపంలాంటి సంచీ పారేసుకొచ్చారు మీ నాన్న?"

"మా బాగా అయిందిలే. నాకైతే యెప్పుడూ ఆ పాత తోలుసంచీయిస్తావు."

లోపల్నుంచి సంభాషణం.

తలెత్తి ఆకాశంలోకి చూశాడు శేషగిరి ఆకాశం నిర్మలంగావుంది. చక్కని చుక్కనవ్వుతుంటే- వొంపు తిరిగిన పెదాల్లా చంద్రుడు. వజ్రాలు విరజిమ్మినట్లు అంతా పరచుకున్న చుక్కలు. మాటలకందని అనుభూతి అతన్ని ముంచివేసింది.

ఇంత విశాల విశ్వంలో ఈ నక్షత్రాలకన్న యెంతో చిన్నదయిన ఈ భూమండలంలో, ఈ దేశంలో, ఈ వూళ్లో, ఈ యింట్లో నంచీ పోవడం! – సావిత్రి కది అంతర్జాతీయ సమస్య వంటిది.

"అక్కడే నిద్రబోతారులా వుంది. కాసేపాగి లోపలకొచ్చేయండి, ఆ కుర్చీ

కొత్తదనం కోరేవారికి
సరికొత్త రచనామాలిక
మాలతీ చందూర్ నవలలు
గోపవనిత 11·00
మంకెన పువ్వు 11·00
జీలక్ష్మి పబ్లికేషన్స్
ఏలూరురోడ్ · విజయవాడ - 520 002

THE INSTITUTE OF ENGLISH STUDIES
ఆంగ్ల భాషాబోధక సంస్థ,
3, మొదటి మెయిన్‌రోడ్డు, లేక్ ఏరియా,
నుంగంబాకం, మదరాసు-600 034
(వళ్లువరుకోటము ప్రక్కన)

WAVERING MIND IS SET STEADFAST BY THE MAGIC WAND OF EDUCATION

16 ఏండ్ల వయస్సునకు పైబడినవారు
అధికపక్షము ఒకే సంవత్సరములో
ఆంగ్లములో
సంభాషించుటకును,
పరిచయముచేసికొనుటకును
తపాలా ద్వారా
విశ్రాంతి సమయములో
ప్రారంభమునుండి కాని -
లక్ష్యలక్షణ
పరిశోధన పద్ధతిలోకాని
ఇంగ్లీషు
నేర్చుకోవచ్చును.



మానస మర్కటమా! నీ ఆటలు నావద్ద సాగవు. ఇక నీ యిష్టానుసారము ఆట అనుమతించను. నా తాళముసరే నీ వాడవలెను.
'ఆగ'మనిన ఆగవలెను. 'కదల'మనిన కదలవలెను.
నీచేత పాతమాలయను పూలమాలనిచ్చెదను. తొలుతవలె దానిని నీవు నలుపలేవు. కళామతల్లి చరణముల కర్పించి, కరములు జోడించి, హృదయ పూర్వకముగా నమస్కరించవలెను.

చేరుటకై దరఖాస్తు చేయుటకు ఆఖరు తేదీకిని, పూర్తి వివరములకును వెంటనే లేఖను వ్రాయండి.

ప్రారంభించు క్రొత్త తరగతులగూర్చి నేరుగా వచ్చికాని, 25 పైసల తపాలాబిళ్లతో లేఖను వ్రాసికాని పూర్తి వివరములను తెలిసికొనండి. వెంటనే చేరండి.

G. SHANMUGASUNDARAM, Principal

ఉచితం ఉచితం ఉచితం

తెల్ల మచ్చలు

ఏ రకం తెల్లమచ్చలైనా సరే వాని రంగు మరియు ఎర్రమచ్చలరంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన యెడల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మంవలె నుండి పోవును. ప్రచారం కొరకు 1 సీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి Address

GAUTAM CHIKITSALAYA
(S-DD)
(P.O.) KATRI SARAI (GAYA)

శుభవార్త

డాక్టర్లకు సాధ్యముకాక వదిలి వేయబడిన అన్ని వ్యాధులకు చికిత్స చేయబడును. లావుపాటివారు సన్నగను, బలహీనులను బలవంతులుగను చేయబడుదురు. మధుమేహము, రక్తపుపోటు, కుష్ఠు, బొల్లి, క్యాన్సరు సంతానంలేని వారు కూడా శ్రీ యోగిగారి కాయకల్ప చికిత్సవలన సంపూర్ణ ఫలితము పొందగలరు. ఈ చికిత్స వలన దేహములోని అన్నివ్యాధులు తొలగిపోవుటయేగాక నూతన యవ్వనము కలుగును. వివరములు కోరువారు పోస్టు ఖర్చులకు రు. 4-00లు యం.ఓ. పంపవలయును.

మేనేజర్,
శ్రీ యోగాశ్రమ్,
పెదవాల్తేరు P.O.,
విశాఖపట్టణము-17.

వదిలేసేరు.... మళ్ళీ కొనుక్కోలేం!" –

గుమ్మంలోంచి తల బయటికి పెట్టి కాస్త బిగ్గరగానే అనేసి వెళ్ళింది సావిత్రి ఆ మాటలు గాల్లో తేలివెళ్ళిపోయాయి. అతని హృదయం దాకా రాలేదు. కళ్ళు పైకప్పు రెప్పకుని ఆకాశంలోకే చూస్తూ కూర్చున్నాడు. అతనికి అకస్మాత్తుగా సర్కస్ జ్ఞాపకం వచ్చింది. తాను సర్కస్‌కి వెళ్ళిన సంగతి సావిత్రితో చెప్పనే లేదు. బిలబిలాడుతూ అమ్మాయిలు తళుకు బట్టల్లో వొంటి చక్రం సైకిళ్ళు తొక్కడం పులి నాలుగుకాళ్ళతో బంతి దొర్లించటం ఉయ్యాల్లో నాను గింగిర్లు కొట్టడం. అతని కన్ను మూతబడింది. ఆ నిద్రలో అతనికో కల వచ్చింది. అందులో మనుష్యులు తలక్రిందులుగా నడుస్తున్నారు.

చటుక్కున మెలకువ వచ్చింది అతనికి రోడ్డుమీద జనసంచారం చాలావరకు తగ్గిపోయింది. చంద్రుడు కనబడ్డంలేదు ఏ వొంటిగంటో అయ్యుంటుంది. అతనులేచి యింటోకొచ్చి తలుపు గడియ పెటాడు. పక్కమీద కెళ్ళబోతుంటే జ్ఞాపకం వచ్చింది. కుర్చీ! తలుపుతీసి కుర్చీతెచ్చి లోపల వేశాడు.

ట్రాన్స్‌ఫార్మర్ వెలుగులో పెద్దది. బాచిగాడు ఒకే మంచంమీద నిద్రపోతూ కనిపించారు. పెద్దదాని మొహం ప్రశాంతంగా వుంది బాచిగాడు నిద్రలో కూడా యుద్ధం చేస్తున్నట్లే మొహం పెడతాడు కాళ్ళు ముడిచి మోకాళ్ళతో పెద్దదాని డొక్కలో కుమ్ముతున్నట్లు పడుకున్నాడు ఓ చెయ్యి కింద వేలాడుతోంది శేషగిరి చెయ్యితీసి పదిలంగా వాడి గుండె మీద పెట్టాడు.

పడుకోబోతుంటే అతనికి అనుమానం వచ్చింది. తలుపు గడియ వేశాడోలేదోనని. మళ్ళీ వెళ్ళి చూశాడు నిజంగానే వెయ్యలేదు. సావిత్రి అనేమాటలు చాలా మటుకు యదార్థాలే. అన్నీ ఇలా మర్చిపోవడం తన సహజ లక్షణం. కానీ తన అలవాటుకి విరుద్ధంగా తాను అన్నీ క్రమబద్ధంగా చెయ్యాలనే సావిత్రి తనకి రింగ్ మాస్టర్ లా కనబడుతుంది.

బాచిగాడు కలవరించాడు. శేషగిరి వెళ్ళి వాణ్ణి సరిగ్గా పడుకోబెట్టి వచ్చాడు పెద్దదాని నిద్దర. బాచిగాడు చదువు బద్ధకం వదిలేస్తే ఎంతబాగుణ్ణు కానీ అవి వదలవు. అవి వాళ్ళ సహజ లక్షణాలు. మారాలని తనంటే వాళ్ళ ప్రాణానికో విలన్‌లా కనిపిస్తాడు పోనీ వాళ్ళనలా వాళ్ళ సహజ గుణాలతో వదిలెయ్యకూడదూ! వదిలేస్తే



ఏకాంతంలో ఓ కాంత!

చిత్రం : పవని కిరణ్. తెనాలి

ఏముంది? ఏ ముందో తనకు తెలుసు అందుకే వొదలడు

మంచం చప్పుడికి సావిత్రికి కాస్త మెలకువ వచ్చినట్లుంది.

"కుర్చీ తెచ్చావా? ..." మూలిగినట్లు అడిగింది.

"ఆ.. ఆ...." అన్నాడు ఆమె మళ్ళీ నిద్రలోకి జారిపోయింది

ముడిచిపెటిన కుర్చీ మూల వింత ఆకారంలో కన్పిస్తోంది పెద్దదాని పుటకలకి ఏవో వేలంలో చవగ్గావస్తే కొన్నాడు. ఇప్పుడు మండిపోయే ధరల్లో కొనాలంటే ఓ వంద కావచ్చు. అసలు మళ్ళీ కొనడం అనే ప్రసక్తి వుందా. తమ జీవితాల్లో? వున్నవి వుంచుకోవడమే!

సావిత్రి తమాషాగా గురక పెడుతూ నిద్రపోతోంది. ఆ చప్పుడు తనెక్కడో విన్నాడు. అతనికి చప్పున తట్టింది సర్కస్‌లో పులి అలాగే గాండ్రించింది. పులి ఎంత నేర్పుగా విన్యాసాలు చేసింది! దానిలాంటి జంతువు చేత అంత చక్కగా చెయ్యించడానికి ఎంత నేర్పు కావాలి ఆ రింగ్ మాస్టర్‌కి! అతని చాతుర్యంలోనే యిమిడి వుంది ఆకర్షణంతా ....

సావిత్రికి దగ్గరగా జరిగి పడుకున్నాడతను నిద్రపోతున్న ఆమెను కుదిపి అడిగాడు "ఏమే ......., రేపు పిల్లల్ని సర్కస్‌కి తీసుకెళ్దామా?"

"ఊ....!" ఆవిడ మూలిగి అతని వైపు తిరిగి పడుకుంది. ★